ప్రజాశక్తి
మంగళవారం 18 ఏప్రిల్ 2023 5
అనంతపురం

ప్రచారభేరి కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నాయకులు

మతోన్మాద బిజెపిని తరిమికొడదాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

స్వార్థ రాజకీయాల కోసం దేశంలో కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతవిద్వేషాగ్ని రగులుస్తున్న మతోన్మాద బిజెపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. విభజన హామీల అమలు, రైల్వే జోన్ ఏర్పాటు, కేంద్ర విశ్వవిద్యాలయానికి నిధులు తదితర సమస్యల పరిష్కారంపై బిజెపి అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరీ యాత్రను సోమవారం నాడు గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంభూపాల్‌తో పాటు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రాకముందు రాష్ట్రానికి అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడచినా ఇప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. తొమ్మిదేళ్లగా ప్రజలను అడుగడుగునా బిజెపి మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి దేశంలో మత ఘర్షణలను సష్టిస్తూ మత విద్వేషాలను సృష్టించే కుట్ర చేస్తోందన్నారు. పేదలను విస్మరించి అదానీ,అంబానీల సేవల్లో మునిగి తేలుతూ దేశ సంపదను వారికి దొచిపెడుతోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు పరం చేస్తోందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ హామీ, రూ.15 లక్షల కోట్ల నల్ల ధనం ఏమైనాయని ప్రశ్నించారు. కేంద్రం తీరును ఎండగడుతూ ఈ నెల 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచారభేరీ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, తిమ్మప్ప, ఓబులేసు, మస్తాన్, ప్రసాద్‌బాబు, ఖాదర్ బాషా, ఎస్‌ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్ సమీర్ పాల్గొన్నారు.

చిత్రావతిపై అదానీ కన్ను..!

అదానీ సంస్థలపై దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున దుమారం రేగుతున్నా రాష్ట్రంలో మాత్రం ఆయన సంస్థ పవర్ ప్రాజెక్టుల విషయంలో మాత్రం ముందుకే వెలుతోంది. చిత్రావతి ప్రాజెక్టుపై పంప్డు స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆ సంస్థకు ముందుకెళుతున్నట్టే కనిపిస్తోంది. 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇక్కడ పంప్డు స్టోరేజీ పవర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే మంజూరు చేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. మంత్రివర్గ సమావేశంలో ఆ సంస్థ ఏర్పాటుకు 400 ఎకరాల వరకు భూమిని కేటాయిస్తూ నిర్ణయం సైతం చేసింది. దీనిపై అప్పట్లో విమర్శలు సైతం వెల్లువెత్తాయి. అయినా అదానీ పంప్డు స్టోరేజీ ప్రాజెక్టు పనులు మాత్రం జిల్లాలో ముందుకు సాగుతున్నట్లు కన్పిస్తున్నాయి.



◆ అదానీ పంప్డు స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు యత్నం
◆ వచ్చే నెల పర్యావరణ అనుమతులపై గ్రామసభలు
◆ సోలార్ పవర్ ప్రాజెక్టు సగానికే మొదటి దశ పరిమితం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అదానీ సంస్థపై ప్రపంచ వ్యాప్తంగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూములను ఆసంస్థకు కేటాయించడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. విమర్శలు ఎన్ని వచ్చిన అదానీకి కేటాయింపులు మాత్రం తగ్గలేదు. అనుమతులన్నీ లభించి ఉండటంతో అదానీ ఎనర్జీ చిత్రావతిపై 500 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డు స్టోరేజీ పవర్‌ప్లాంటు ఏర్పాటుకు సిద్ధపడుతోంది. దీనికి అవసరమైన పర్యావరణ అనుమతులకై మే మొదటి వారంలో పర్యావరణ అనుమతులకై కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో పబ్లిక్ హియరింగ్ జరిగే అవకాశాలున్నట్టు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు నాలుగింటిని రాష్ట్ర ప్రభుత్వం అదానీ సంస్థకు కట్టబెట్టింది. అందులో చిత్రావతి ఒకటి కాగా, గండికోటపై వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో మరో ప్రాజెక్టుకు అనుమతినిచ్చింది. ఇప్పుడు చిత్రావతిపై నిర్మించబోయే ప్రాజెక్టు పనులు పురోగతిలోనున్నట్టు తెలుస్తోంది. అటు సోలార్, ఇటు హైడ్రో పద్ధతిలో రెండింటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి ఈ ప్రాజెక్టు ద్వారా చేపట్టాలన్నది లక్ష్యం. ఇక్కడ కేటాయించిన భూమి మొత్తం ప్రభుత్వ భూమియే ఉన్నట్టు సమాచారం. ఎకరానికి ఐదు లక్షల రూపాయల చొప్పున భూ కేటాయింపులు జరిపేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

సోలార్ ఎనర్జీ పనులపై వెనక్కు తగ్గారా..?

అదానీ సంస్థ అనంతపురం జిల్లా పరిధిలోని రాయదుర్గం ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన సోలార్ ఎనర్జీపై కాస్త తగ్గినట్టు కనిపిస్తోంది. మొదట 15 వేల ఎకరాల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రచారం సాగింది. ఈ మేరకు గ్రామాల వారీగా భూసేకరణకు అవసరమైన కసరత్తును జిల్లా నెడ్‌క్యాప్ సంస్థ చేపట్టింది. అదానీ సంస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రైతుల్లోనూ అయోమయం, గందరగోళం నెలకొంది. భూములు ఇచ్చాక ఏడాదికి ఇస్తామన్న లీజు ఇస్తారా లేదా అన్న సందేహాలు సైతం వ్యక్తయ్యాయి. ఈ నేపథ్యంలో అదానీ సంస్థ కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై కాస్త వెనక్కు తగ్గినట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం రాయదుర్గం ప్రాంతంలో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ మాత్రం 7500 ఎకరాలకే పరిమితమయ్యేందుకు సిద్ధపడినట్టు సమాచారం. ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. అయితే ఏర్పాటు పనుల్లో మాత్రం ఆ సంస్థ నిమగ్నమై ఉంది. ఏది ఏమైనా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అదానీ సంస్థ చిన్న చిన్నగా పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన కసరత్తును కొనసాగిస్తూపోతూనే ఉంది. ఈ ప్రాజెక్టులను 2028 నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెలుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం కూడా అందుకు అవసరమైన తోడ్పాటు, సహకారాన్ని అందించే విధంగా చర్యలు చేపడుతూపోతోంది.

గడువులోపు 'స్పందన'కు పరిష్కారం

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అర్జీదారునితో మాట్లాడుతున్న జెసి కేతన్‌గార్గ్

నిర్ణీత గడువులోపే స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. భూగర్భ గనులు, జిల్లా ఉపాధి కల్పనాధికారి, కూడేరు, నార్పల, రాప్తాడు తహశీల్దార్లు, ఉరవకొండ గ్రామ వార్డు సచివాలయానికి చెందిన మండల అధికారులకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఆరు అర్జీలు మరో 24 గంటల్లో గడువు తీరనున్నందున వెంటనే వాటిని నాణ్యతగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన కణేకల్ ఈవో, ఉరవకొండ ఉద్యాన శాఖ అధికారి, గార్లదిన్నె, రాప్తాడు మండల సర్వేయర్లు ఇన్‌కరెక్ట్ ఎండార్స్‌మెంట్లను అర్జీదారులకు పంపారని, వాటిని వెంటనే సరిచేసి పంపాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు సంబంధించిన అధికారులు ఆ సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికను ఇంకా పంపలేదని వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెంటనే చర్యల నివేదికను సిపిఒకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రిదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, అన్సెట్ సిఇఒ కేశవనాయుడు, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలి

రాయదుర్గం కమిషనర్‌కు 'కాలవ' వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, నాయకులు

పట్టణంలో తాగునీటి సరఫరాను మెరుగుపరిచి నీటి ఎద్దడిని నివారించాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో పట్టణంలో మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతవారం, పదిరోజులుగా పట్టణ ప్రజలు తీవ్రమైన తాగునీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొళాయిల ద్వారా అరకొరగా సరఫరా అవుతున్న నీరు సైతం రంగు మారి దుర్వాసన వెదజల్లుతోందని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నట్లు వాపోయారు. వెంటనే తాగునీటి సరఫరాలో ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ గతంలో పంపింగ్ పైప్‌లైన్ పగిలిపోవడం, మరమ్మతుల కారణంగా నీటి సరఫరాలో జాప్యం జరిగిందన్నారు. ఇకపై రెండు రోజులకోసారి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం మాజీ అధ్యక్షుడు ముదిగల్లు జ్యోతి, వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, టిడిపి పట్టణ అధ్యక్షులు నాగరాజు, రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, పురపాలక సంఘం మాజీ ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, వెంకటేశులు, మాజీ వార్డు సభ్యులు భారతి, వెంకటేశులు, నాయకులు తిప్పయ్య, సన్నన్న, అంజి, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదుదారులకు సత్వరన్యాయం :

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పోలీసులతో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి

స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేసే బాధితులకు సత్వర న్యాయం చూపేందుకు కృషి చేయాలని అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా స్పందన కార్యక్రమానికి ప్రతి సోమవారం ఎన్ని పిటీషన్లు వస్తున్నాయి, సదరు పిటీషన్లకు ఎలా పరిష్కారం చూపుతున్నారు.. అని అడిగి తెలుసుకున్నారు. పిటీషనర్ల సమస్యలకు చట్ట పరిధిలో నిర్ధేశిత సమయంలో పరిష్కారం చూపి సంతృప్తి పడేలా చూడాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంస్కరణలతో స్పందన పిటీషనర్లకు మరింత న్యాయం జరిగేలా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మహిళకు కరపత్రం అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగా స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి రఘురాంరావు, వైసిపి నాయకులు కదరంపల్లి బాబులు, పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

దేవరకొండపై కారు ప్రమాదం

◆ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ మృతి ◆ ప్రమాదమా.? ఆత్మహత్యా.? అన్న కోణంలో విచారణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కొండపై నుంచి కిందకు పడి గుర్రై నుజ్జునుజ్జు అయిన కారు

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని కొండమీదరాయుని దేవరకొండపై ఓ కారు సోమవారం ఉదయం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అనంతపురానికి చెందిన శ్రీవిద్యానికేతన్ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతి అక్కడికక్కడే మృతి చెందాడు.కాగ ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.? లేక కరస్పాండెంట్ ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... అనంతపురం నగర్‌కు చెందిన శ్రీవిద్యానికేతన్ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతి(56) సోమవారం ఉదయం డ్రైవర్‌తో కలిసి కారులో కొండమీద రాయుని స్వామి దర్శనానికి సోమవారం ఉదయం వెళ్లాడు. అక్కడ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో అనంతపురం బయల్దేరారు. ఈ సమయంలో కాసేపు ఫోన్‌లో మాట్లాడుకోవాలంటూ ఉమాపతి డ్రైవర్ నుంచి కారు బయట ఉంచి కారు తలుపులు వేసుకున్నాడు. కొంత సేపటి తరువాత కారు అక్కడి నుంచి మందుకెళ్లి కొండపై నుంచి పల్టీలు కొడుతూ కిందపడింది. కొండపై నుంచి కారు కిందపడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో అందులో ఉన్న ఉమాపతి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగ ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.? లేక ఆయన ఆత్మహత్య చేసకున్నాడా అన్న కోణంలో పోలీసులు దర్యాపు చేస్తున్నారు. కొండపై నుంచి కారు పల్టీలు కొట్టే సమయంలో డ్రైవర్ తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం అయ్యింది.

ప్రయివేటు పాఠశాలలు యాజమాన్య (అపుస్మా) సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కమలానగర్‌లోని కార్యాలయంలో ఉమాపతి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శు కుసుమ పుల్లారెడ్డి, గాజుల చంద్ర, జిల్లా ట్రెజరర్ ఎంఎం.ఇక్బాల్, గౌరవాధ్యక్షుడు నాయుడు, రాష్ట్రం కో ఆర్డినేటర్, ట్రెజరర్ రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, ఈసీ సభ్యులు శశిభూషన్, రాష్ట్ర కన్వీనర్ ఎం.నాగరాజు, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీ స్కూల్ మధుసూధనరెడ్డి, సిటీ డివిజన్ నాయకులు రవిశంకర్‌ప్రసాద్, జిల్లా ఉపా ధ్యక్షులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

స్పందనలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం కలెక్టరేట్ : తన స్థలం కబ్జాదారుల నుంచి కాపాడాలని ఒక వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. తాడిపత్రి మండలం, సుంకులమ్మ పాలెంకు చెందిన ఆలూరు శేఖర్ కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇవ్వాలని వచ్చాడు. అర్జీ రాయించుకుని రెవెన్యూ భవన్‌కు వెళుతున్న సమయంలో తన వెంట దాచుకుని తెచ్చు విషద్రావణం బాటిల్ సర్దుకున్నాడు. అటుగా వెళుతున్న పోలీసులు గమనించి అతని నుంచి బాటిల్‌ని లాగేశారు. విషం తాగేందుకు యత్నించిన సమయంలో బాటిల్ లాగేశారు. విషద్రావణం అతినిపై పడింది. విషయం తెలుసుకున్న పాత్రికేయులు అతన్ని ప్రశ్నించారు. ఆత్మహత్యకు కారణాలు అడిగారు. తనకు తాడిపత్రి నంద్యాల రోడ్డులో 54 సెంట్ల స్థలం ఉందని, సురేష్ అనే విలేకరి, వైఎస్ఆర్‌సిపి నాయకులు రామ్మూర్తిరెడ్డి, బాల్‌రెడ్డిలు తనపై దాడి చేసి స్థలం కబ్జా చేశారన్నారు. వారి నుంచి స్థలం కాపాడి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇది వరకే స్థానిక అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడం ఇక్కడి వచ్చినట్లు తెలిపారు. తన జీవనాధారంగా ఉన్న స్థలాన్ని కాపాడి న్యాయం చేయాలని వేడుకున్నాడు. సకాలంలో పోలీసులు స్పందించడం ప్రాణాపయం తప్పిందని అక్కడి అర్జీదారులు అనుకున్నారు.

భూకబ్జాపై విచారణ చేపట్టండి

◆ గార్లదిన్నెలో 6 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా ◆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మానకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం గార్లదిన్నె మండలం కేంద్రంలోని సర్వే నెంబర్ 456 1బీసీ, 456-1 బీ4లోని 6.10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సోమవారం నాడు విజ్ఞాపక లేఖను పంపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ గార్లదిన్నె మండల కేంద్రంలో 456 1బీసీలో ఇనయతుల్లా పేరుతో 3.06 ఎకరాలు, 456-1బీ4లో రహీమ్‌బీ పేరుతో 3.04 ఎకరాలను 1980లో డి పట్టా ఇచ్చారని తెలిపారు. 2008 వరకు వీరు ఈ భూమిని సాగు చేసి పంటలు పెట్టినట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉందన్నారు. 2008లో వీరి నుంచి ఈ మొత్తం భూమి 6.10 ఎకరాలు కె.నాగరాజు అనే వ్యక్తి కొనుగోలు చేసి తన కుమారుడు కె.జీవన్, కె.భానురేఖల పేరుతో పట్టాలు పొందారని తెలిపారు. అప్పటి నుంచి 2022 వరకు వీరు ఆ భూమిలో చీనీచెట్లు పెట్టారని తెలిపారు. చెట్ల మధ్య వేరుశనగ పంటతో పాటు ఇతర పంటలూ సాగు చేసినట్లు క్రాప్ బుకింగ్‌లో నమోదైందన్నారు. పంటల సాగుకు ప్రభుత్వం నుంచి అందుతున్న అన్ని రకాల పంట రుణాల, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వార పొందినట్లు ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా నమోదైందన్నారు. 2018-19 సంవత్సరంలో పట్టాదారుడు కె.జీవన్ హార్టికల్చర్ శాఖ ద్వారా హార్టికల్చర్ షెడ్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4 లక్షల రుణం, ఇందులో రూ.2 లక్షలు సబ్సిడీ సదుపాయం పొందారని తెలిపారు. 2023 ప్రారంభంలో ఆ భూమిని కె.జీవన్, కె.భానురేఖ ఇతరులకు విక్రయించాడని తెలిపారు. వారు ఈ భూమిలోని చీని చెట్లను తొలగించి రియల్ ఎస్టేట్ ప్లాట్స్ వేశారన్నారు. ఇది డి పట్టా కావడంతో ప్లాట్లుగా అమ్మడానికి వీలు కానందున భూమి కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వారితో కొందరు రెవెన్యూ అధికారులు లాలూచిపడి 2008లో మాజీ సైనిక ఉద్యోగులకు పట్టా ఇచ్చినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారన్నారు. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రుణం పొంది నిర్మించిన షెడ్, ఆ షెడ్‌కు రాసిన పథకం వివరాలు, పట్టాదారుని పేరు, సబ్సిడీ మొత్తం కె.జీవన్ పేరు మీదనే ఉన్నాయని తెలిపారు. 2008లో పట్టా పొందినట్లు చూపబడుతున్న మాజీ సైనిక ఉద్యోగుల్లో ఒకరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన గంటా మురళీకృష్ణారెడ్డి, మరొకరు ప్రకాశం జిల్లాకు చెందిన చిన్న వెంకటరెడ్డి అన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వీరికి అనంతపురం జిల్లాలో ఎలా డి పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు. 1980 నుంచి 2008 వరకు అనుభవంలో ఉన్న ఇనయతుల్లా, రహీమ్‌బీల నుంచి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి నోటీసు ఇచ్చినట్లు రికార్డుల్లో లేదన్నారు. కేవలం తహశీల్దార్ కార్యాలయం రికార్డుల్లో పెట్టుకునేందుకు భూ స్వాధీనం చేసుకున్నట్లు 2008 నాటికి ఉద్యోగంలో లేని విఆర్ఒ, ఆర్ఐల సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించినట్లు తెలుస్తోందన్నారు. మాజీ సైనిక ఉద్యోగులకు పట్టా ఇచ్చినట్లు చెబుతున్న పట్టాపై తహశీల్దార్ సంతకం కూడా నాడు గార్లదిన్నెలో పనిచేసిన తహశీల్దార్‌ది కాదని తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాకు జరుగుతున్న ఈకుట్రపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి స్పందించి, సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. 2008 తరువాత కె.జీవన్, కె.భానురేఖ పట్టా పొందిన విధానం, 2008 నుంచి 2022 వరకు కె.జీవన్, కె.భానురేఖల పేరుతో ప్రభుత్వం ద్వారా వ్యవసాయ రుణాలు, సబ్సిడీలు ఇతర సదుపాయలు పొందిన విషయం పరిశీలించా లన్నారు. 2018-19 సంవత్సరంలో హార్టికల్చర్ శాఖ ద్వారా రూ.4 లక్షల రుణం, అందులో రూ.2 లక్షలు సబ్సిడీ పొందిన విషయం, మాజీ సైనిక ఉద్యోగులుగా చెప్పబడుతున్న గంటా మురళీ కృష్ణారెడ్డి, చిన్న వెంకటరెడ్డిలకు 2008లో పట్టాలు ఇచ్చి ఉంటే 2022 వరకు కె.జీవన్, కె.భానురేఖ పేర్లతో పట్టాలు పొంది, ప్రభుత్వ సహాయం ఎలా తీసుకున్నారనే విషయాలపై నిగ్గుతేల్చాలన్నారు. మాజీ సైనిక ఉద్యోగులకు ఇచ్చారని చెప్పబడుతున్న పట్టాలపై తహశీల్దార్ సంతకం, అది పొందటానికి ముందు జరిగిన రికార్డుల్లోని తహశీల్దార్ సిబ్బంది సంతకాలను పరిశీలించాలన్నారు. నకిలీ రికార్డులు సృష్టించడానికి కారణమైన రెవెన్యూ అధికారులు, ఈ పట్టాల ఆధారంగా రియల్ ఎస్టేట్ చేస్తున్న వ్యాపారులు, వారి వెనుక ఉన్న రాజకీయ పెద్దలు వెలుగులోకి రావడానికి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. దీనిపై వెంటనే కలెక్టర్ ఎమ్.గౌతమి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి స్పందించి విచారణ జరపాలని కోరారు.

రఘురామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

అభినందనీయులు.. రఘురామయ్య..!

నార్పల : కాడి..మేడి పట్టిన చేతితో కలాన్ని పట్టి సాహితీ సేద్యం చేస్తున్న అక్షర శ్రామికుడు ఆకుల రఘురామయ్య అభినందనీయులని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, జయహో భారతీయం వారి ఆధ్వర్యంలో శోభకృత నామ తెలుగు సంవత్సర మహోత్సవాలు విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు మాట్లాడుతూ.. సాహితీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకుని నిరంతర సాహితీ సేవ చేస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన సాహితీవేత్త, తానా కవితా పురస్కార గ్రహీత ఆకుల రఘురామయ్యను విశిష్ట సేవా రత్న అవార్డుతో సత్కరించడం సముచితమేనని అభిప్రాయపడ్డారు.' పి.విజయ్ బాబుతో పాటు ఇంతియాజ్ అహ్మద్ అదితరులు ఆయనను సన్మానించారు.

ఓటుతో బుద్ధి చెబుదాం

అనంతపురం కలెక్టరేట్ : ఓటుతోనే వైసీపీకి బుద్ధి చెప్తామని 23వ డివిజన్ ప్రజలు పేర్కొన్నారు. సోమవారం మాజీ శాసన సభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్‌ఛార్జి మార్కెట్ మహేష్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, వైసీపీకి ఓటు వేసి మోసపోయామని, ఒక్క అవకాశం అని ఛాన్స్ ఇస్తే, మొత్తం ధరలు పెంవేసి బతకడమే భారం చేశారని వాపోయారు. ఓటుకు రూ.5 వేలు ఇచ్చినా.. తీసుకొని తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి పది మూల్యాంకనం

అనంతపురం సిటీ : పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ 2023కి సంబంధించిన మూల్యాంకనం ప్రక్రియ ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, ఎసి గోవింద నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కోసం నియమించబడ్డ ఉపాధ్యాయులు ఎలాంటి మినహాయింపులు లేకుండా విధులకు హాజరు కావాలన్నారు. దీని కోసం ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా కేటాయించడం జరిగిందన్నారు. తెలుగు 139, హింది 115, ఇంగ్లీష్ 251, గణితం145, ఫిజికల్ సైన్స్ 145, బయలాజికల్ సైన్స్ 145, సోషల్ స్టడీస్ 101, సాంస్కృతం 10, ఒకేషనల్ విద్య 5, స్పెషల్ అసిస్టెంట్స్ 240 మందిని నియమించామని చెప్పారు. ఎవరైతే మూల్యాంకనం విధుల కోసం నియమించబడ్డారో వారందరూ 19వ తేదీ ఉదయం 8:30 గంటలకు అనంతపురంలోని కెఎస్ఆర్ గర్ల్స్ గవర్నమెంట్ హైస్కూల్లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు.

వీధుల్లో గ్రామసింహాల బెడద

యాడికి : కనపడిన వారినందరిని కరుస్తూ ఆసుపత్రి పాలు చేస్తోన్న వీధి కుక్కలను పట్టి పారద్రోలాలని 15 వార్డుకు చెందిన ప్రజలు తహసీల్దార్ అలెగ్జాండర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత 10 రోజుల్లోనే కుక్కలు 16 మందికి పైగా పిల్లలు, వృద్ధులను కరచి గాయాల పాలు చేశాయని వాపోయారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న వారి వెంటపడుతున్న క్రమంలో భయపడి కిందపడి కాళ్లు, చేతులు విరిగిన ఘటనలు జరిగాయన్నారు. చర్యలు తీసుకొని కాపాడాలని కోరారు.

ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని వినతి

గార్లదిన్నె : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 456 లోగల ఆరు ఎకరాల 10 సెంట్ల భూమిని అధికార పక్షానికి చెందిన నాయకులు ఆక్రమించుకొని వెంచర్ వేస్తున్నారని, దీనిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు సోమవారం డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు కబ్జా చేసిన భూమిలో ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టాలని తెలిపారు. దానిని వెంటనే స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇల్లు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'స్వచ్ఛ భారత్'లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఉరవకొండ : ఉరవకొండ మహాత్మ ప్రయివేటు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బూదగవి గ్రామంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ షాజహాన్, ఏవో కేకే ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ వరకు గ్రామస్తులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోవిడ్ జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, చెట్లు నాటే కార్యక్రమాలతో పాటు స్వచ్ఛభారత్ వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలకు గ్రామ ప్రజలందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఇషాక్ అహ్మద్, సత్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

1964 చట్ట సవరణలను రద్దుచేయాల్సిందే

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీలలో 50 శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ, రైతు భరోసా కేంద్రాలను విలీనం చేస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలు రద్దుచేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆపరేటీవ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ బి.ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికే పూనుకున్నాయని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం జాతీయ సంస్థలన్నింటిని ప్రయివేటీకరణ చేసి ఉద్యోగులను అభద్రతా భావంలోకి నెట్టి వేస్తోందన్నారు. ఉద్యోగులను పొమ్మన లేక పొగ పెట్టిన చందాన నష్టాలు వచ్చాయనో, ఇతరత్రా కారణాలతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచిపెడుతూ దేశానికి నష్టం కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తాను తక్కువేమీ కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పిందల్లా ఊకొడుతూ అన్ని చట్టాలకు మద్దతు పలుతుండటం అన్యాయంగా ఉందన్నారు. ఏళ్ల తరబడి గ్రామ రైతులకు, ప్రజలకు ఎంతో మెరుగైన సేవలు అందిస్తున్న ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం పూనుకోవడం ప్రమాదకరం అన్నారు. ఈ సొసైటీలను రక్షించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. అందుకు సిఐటియు పోరాటాలు చేయనుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన అరియర్స్, వేతన సదుపాయలు ఇవ్వకుండా జాప్యం చేయడం ప్రభుత్వానికి సరికాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు ప్రభుత్వమని చెబుతుంటారని, రైతులకు ఏళ్ల తరబడి సేవలు చేస్తున్న సొసైటీ ఉద్యోగుల భద్రత పట్టదా అంటూ ప్రశ్నించారు. తక్షణమే ఉద్యోగులకు 36 జిఒ 90 ప్రకారం వేతనాలు, ఇతర సదుపాయాలు అమలు చేయాలన్నారు. మరో అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర నాయకులు ఎజి.రాజమోహన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ విధానాలతో ఇలాంటి పరిస్థితి తలెత్తుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే ప్రోత్సాహకాలు ప్రభుత్వ సంస్థలకు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వాల వైఖరి మారాలంటే ఐక్య పోరాటాలు చేయడమే సరైన మార్గం అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2050 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో 7500 మంది ఉద్యోగులు దీర్ఘకాలంగా సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం చలనం లేకుండా ఉంటడం సరికాదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా నిలవడం బాధాకరం అన్నారు. ఎపి రైతు సంఘం నాయకులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. కో ఆపరేటీవ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, హరికృష్ణ, కన్వీనర్ ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2029 నాటి వేతన సవరణ వెంటనే చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలన్నారు. 36 జిఒ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాల పదివి విరమణ వయసును పెంపుదల చేయాలన్నారు. పిఎసిఎస్‌లకు ఇన్‌కమ్ ట్యాంక్ పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. టీడీఎస్‌లో ఉన్న ఇబ్బందులు తొలగించాలన్నారు. ఇప్పటికే బ్యాంకులు పనులు చేసిన టిడిఎఫ్ మొత్తాలను తిరిగి సంఘాలకు జమ చేయాలన్నారు. సంఘాల షేర్ ధనం పై 6 శాతం డివిడెంట్, వడ్డీ తక్షణమే చెల్లించాలన్నారు. 2011-2013 మధ్య కాలంలో రైతులకు ఇచ్చిన వడ్డీ రాయితీ ఇప్పుడు సహకార సంఘాల పేర కొన్ని జిల్లా కేంద్ర బ్యాంకులు అప్పుగా రాయడం చట్ట బద్ధత కాదన్నారు. ఈ ప్రక్రియను బ్యాంకులు వెంటనే ఉప సంహకరించుకుని రివర్స్ ఎంట్రీలు పాస్ చేయాలని కోరారు. అనంతరం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీరి ధర్నాకు మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, బండారు ఎర్రిస్వామి, సిఐటియు నగర జిల్లా నాయకులు వెంకటనారాయణ హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటీవ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కోశాధికారి దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ రమణారెడ్డి, డివిజనల్ సెక్రటరీ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

నేరాలు ఘోరాలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

బుక్కరాయసముద్రం : ద్విచక్ర వాహనాలను చోరీ చేసే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జమాల్ బాషా తెలిపాడు. బుక్కరాయసముద్రం మండలంలోని గోశాల వద్ద ఒక వ్యక్తి పోలీసుల రాకను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారన్నారు. కర్నాటక రాష్ట్రం తుముకూరు జిల్లా నాగలమడుగుల మండలం, జాడిగుంట గ్రామానికి చెందిన దూదేకుల బాబు (35) చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. మోటార్ సైకిల్ దొంగతనాలు చేసి అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడు. 29 మోటార్ సైకిళ్లను ఎత్తుకెళ్లి అమ్మేందుకు సిద్ధమవుతున్న సమయంలో అరెస్టు చేసి పోలీసులు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గార్లదిన్నె : మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువపల్లికి చెందిన గొల్ల వెంకటప్ప (65) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల వెంకటప్ప తన కొడుకు నాగరాజుతో కలిసి బేల్దారి పని నిమిత్తం ద్విచక్రవాహనంలో అనంతపురం పట్టణానికి బయలుదేరారు. గార్లదిన్నె వద్దకు రాగానే మహారాష్ట్ర హుస్నాబాద్ నుండి బెంగళూరుకు వెళ్తున్న స్కార్పియో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటప్ప మతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలుపల్లి గ్రామ సమీపాన పెన్నా నది కాలువ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఎస్ఐ రామకృష్ణయ్య సోమవారం సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమాని వన్నూరుస్వామిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలతో పాటు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

అరటి తోట దగ్ధం

ఉరవకొండ : ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామానికి చెందిన కె.శివకుమార్ అనే రైతుకి చెందిన అరటి తోటకు నిప్పంటుకోవడంతో దాదాపు 750 అరటి చెట్లు దగ్ధమయ్యాయి. సోమవారం అరటి తోటలో అగ్ని ప్రమాదం జరగడంతో సమాచారం అందుకున్న ఉరవకొండ అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన వై.రాంపురం గ్రామానికి చేరుకుని మిగిలిన అరటి చెట్లు అగ్నికి దగ్ధం కాకుండా కాపాడారు. ఫైర్ స్టేషన్ ఆఫీసర్ భీమలింగయ్య పాల్గొన్నారు.

నమస్కరిస్తాం.. న్యాయం చేయండి...

లేదంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాం : జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి : నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు విధులు సక్రమంగా నిర్వహించి న్యాయం చేయాలని, లేని పక్షంలో తామే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని అధికారులను ఉద్దేశించి జేసి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి తన స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అధికారులు అందరికీ నమస్కారం.. పోలీస్ శాఖ వారితో కొట్లాడదల్చుకోలేదు.. 'మీ విధులు మీరు సక్రమంగా నిర్వహించి న్యాయం చేయండి.. ఇప్పటి నుండి మా విధానం మార్చుకుంటున్నాం'..అని అన్నారు. అక్రమ రవాణాకు సహకరించిన అధికారుల ఆఫీసులకు వద్దకు, ఇంటి వద్దకు వెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. దీనిని అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు సవినయంగా తెలియజేస్తున్నామని చెప్పారు. వారి పనితీరును నాలుగు సంవత్సరాలుగా చూస్తున్నామన్నారు. తాను వార్డుల్లో పర్యటిస్తే అధికారులు తప్పకుండా హాజరు కావాల్సిందే అన్నారు. ఇక వారి ఆటలు సాగనీయం, అడ్డుకుంటామని చెప్పారు. తమకు చాలా రాజకీయ అనుభవం ఉందన్నారు. కొద్ది రోజులపాటు అక్రమ రవాణా నిలుపుదలకు ప్రయత్నిస్తామన్నారు. కానీ పక్షంలో అక్రమ రవాణాకు పాల్పడిన వాహనాలను తగలబెడతామన్నారు. అక్రమాలకు కాలం చెల్లిందన్నారు. అధికారులు తప్పకుండా మార్పు తెచ్చుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఇకపై అనుమతులు లేని ఇసుక అక్రమ రవాణా వాహనాలపై పోలీసులకు ఫిర్యాదు చేయబోమని చెప్పారు. ప్రత్యక్షంగా అడ్డుకుంటామన్నారు. ఇందులో తానే మొదటి ముద్దాయినని అక్రమ ఇసుక రవాణా వాహన యజమానులకు మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.

కలహాలతో సతమతమవుతున్న జంటలను ఒకటి చేద్దాం

అనంతపురం సిటీ : చిన్న సమస్యలతో సతమతమవుతున్న జంటలను కౌన్సిలింగ్ ద్వారా ఒకటి చేద్దామని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు కొనసాగిస్తోన్న కౌన్సెలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సంకల్పించారు. మనస్పర్థలు, కలహాలతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను కౌన్సెలింగ్ ద్వారా ఒకటి చేయడంలో ఆసక్తి గల కౌన్సిలర్ల కోసం జిల్లా పోలీసుశాఖ ఆహ్వానిస్తోందని అన్నారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష ఆశించకుండా, ఏకపక్షం/ స్వార్థంగా వ్యవహరించకుండా కౌన్సెలింగ్ చేయడానికి మంచి పరిజ్ఞానం కల్గిన సైకియాట్రిస్టు, సైకాలజిస్ట్, అడ్వకేట్, గైనకాలజిస్ట్, ఎన్జీవో, రిటైర్డ్ ప్రభుత్వ అధికారులకు ఆహ్వానం పలికారు. ఆసక్తి ఉన్న వారు అనంతపురం దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మొబైల్ నంబర్ 9491308867 కు సంప్రదించాలని కోరారు. ఎడబాటు కుటుంబాలను ఏకం చేయడంలో కౌన్సెలింగ్ నందు మంచి సేవలు అందించిన వారికి ప్రతీ ఏటా జిల్లా యంత్రాంగం ద్వారా ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. అనంతపురం దిశ పోలీసుస్టేషన్‌లో ప్రతీ బుధవారం, శనివారం ఎడబాటులో ఉన్న భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఉంటుంది.

జెడ్.వీరారెడ్డి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : పట్టణ శివారులోని జెడ్.వీరారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, పట్టణ కార్యదర్శి వి. నిర్మల డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్.వీరారెడ్డి కాలనీ ఏర్పాటు అయి 15 ఏళ్లు గడుస్తున్నా సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. వీధిలైట్లు వెలగడం లేదని అన్నారు. కాలనీకి ప్రధాన రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, ఐద్వా మండల అధ్యక్షురాలు ఆర్ఎం.కవిత, నాగమ్మ, లక్ష్మీదేవి, రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్య పెంచాలి

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్‌లో జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్య పెంచాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంఖ్య పెంచాలని ఇప్పటికి 43సార్లు స్పందనలో వినతులు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. నగరంలో పారిశుధ్య కార్మికుల సంఖ్య 600 లోపే ఉందన్నారు. జనాభాకు తగ్గట్టు కార్మికుల సంఖ్య పెంచకపోవడంతో పనిభారంతో కార్మికులు సతమతమవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు ఎక్కడ పనులు అప్పగిస్తే అక్కడ చేశారన్నారు. అలాగే 20 ఏళ్ల నుంచి ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న గార్బేజీ కార్మికులు గృహ యజమానులు ఇచ్చే సొమ్ముతో జీవనం సాగించేవారన్నారు. అయితే ప్రభుత్వం క్లాప్ ఆటో విధానాన్ని ప్రవేశపెట్టడంతో వీరందరూ ఉపాధి కోల్పోయారన్నారు. వారికి జీవనోపాధి కల్పించాలని కోరగా రెండు నెలలు పూడికతీసే పనులు కల్పించి వారికి ఉపాధి కల్పించారన్నారు. ఇకపోతే శాశ్వత ఉద్యోగులు 188 మంది పదవీ విరమణ చేశారన్నారు. ఖాళీ అయిన పోస్టులను ఇప్పటివరకు భర్తీ చేయలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోవిడ్, మలేరియా, గార్బేజీ కార్మికులను ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఉరవకొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా నాలుగో రోజు స్థానిక ఎజిఎస్ పాఠశాలలో స్కూల్ పిల్లలకు అగ్ని నిరోధక పరికరాలైన సిఒ టు ఫైర్ ఎట్టిగ్విసర్, డిసిపి ఫైర్ ఎక్విట్యూసర్, ఏబీసీ ఫైర్ టెక్స్ట్రిబ్యూసర్స్ మొదలైన వాటి గురించి అవగాహన కల్పించినట్లు సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి అశ్వర్థ తెలిపారు. ప్రమాదవశాత్తు శరీరానికి అంటుకున్నప్పుడు ప్రాణాపాయం జరగకుండా ఎలా తనను తాను రక్షించుకోవాలి, బయటకు వచ్చేటప్పుడు ఒక ద్వారం ద్వారానే బయటకు రావాలన్నారు. పై అంతస్తులో మంటలు ఉన్నట్లయితే మెట్ల మార్గాన్ని మాత్రం ఉపయోగించాలన్నారున. లిఫ్ట్ వాడరాదని చెప్పారు. అనేక విషయాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉరవకొండ : అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారులు ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆ శాఖ వారోత్సవాల్లో భాగంగా ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఎ.భీమలింగయ్య ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్, ఆయిల్, గ్యాస్, వల్ల అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసుకోవాలో వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా తమ శాఖ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్, డిగ్రీ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆది మూర్తి నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల 9వ బ్రాంచి, శ్రీ చైతన్య స్కూల్ ఏటీపీ టెన్ బ్రాంచిలో విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఒ పరీక్షల్లో ప్రతిభ కనపరిచారు. సోమవారం చైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విద్యర్థులు చదువుతో పాటు పోటీ పరీక్షల్లో కూడా రాణించాలన్నారు. ఐఎన్‌టిఎస్ఒ గురించి విద్యార్థులకు క్లుప్తంగా తెలియజేశారు. ఈటిఎస్ఒలో నాలుగో తరగతి విద్యార్థి ఎ.రశ్మిత తృతీయ బహుమతి, జిటిఎస్ఒలో మూడో తరగతి విద్యార్థి ఎం.జాహిత్ శ్రీ నందన్, ఐదవ బహుమతి, నాలుగో తరగతి విద్యార్థి జి.లాస్య ఐదవ బహుమతి కైవశం చేసుకున్నారు. 25 మంది కన్సోలేషన్ ప్రైసెస్, 34 మందికి గోల్డ్ మెడల్స్, విఎ ఆర్ట్ కిట్స్ మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారు. వీరందరికి ఎజిఎం సుబ్బారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీదేవి, శాంత, డీన్ సతీష్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, ఏవో విజయ్ కృష్ణ, జోనల్ అకాడమిక్ కో ఆర్డినేటర్ తిరుమలేశు, ప్రైమరీ జోనల్ ఇన్‌ఛార్జి పూజ, అకడమిక్ డీన్ గంగాధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంతో రాష్ట్రానికి తీరని ద్రోహం

ప్రచార పాదయాత్రలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మోడీ ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలతో రాష్ట్రానికి తీరని ద్రోహం జరుగుతోందని, ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపిని గద్దె దింపి సాగనంపి దేశాన్ని కాపాడాలని ప్రజలకు సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామం నుండి తాడిపత్రి తహశీల్దారు కార్యాలయం వరకు చేపట్టిన ప్రచార, పాదయాత్ర నిర్వహిస్తూ నిరసన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మన రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని, ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, ఇలా పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయకపోగా రాష్ట్రానికి ఆయువుపట్లులా ఉన్న విశాఖ ఉక్కును సైతం ప్రైవేటు పరం చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా దాసోహం అంటోందని అన్నారు. రాష్ట్రంలో అలుముకుంటున్న చీకట్ల నుండి బయటపడడానికి ప్రజానీకమే ఉవ్వెత్తున కదిలి ఉద్యమించాలన్నారు. అటువంటి మహెూద్యమం నిర్మించడానికి వామపక్ష పార్టీలైన సిపిఎం, సిపిఐ ముందున్నాయన్నారు. దేశ, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడాలని భావించే ప్రతి ఒక్కరూ కలిసి ఉద్యమించాలన్నారు. అణగారిన వర్గాల కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం, పౌర హక్కుల రక్షణ కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత అందరికీ ఉందన్నారు. ప్రజలందరికీ దుర్భరంగా మారిన కేంద్ర మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. దేశ స్వాతంత్ర్యం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని ఊరూరా జరిగే పాదయాత్ర ప్రచార సభలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రచార పాదయాత్ర ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతితో ప్రారంభమై మే డే వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రచార పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్ రెడ్డి, సిపిఐ నాయకులు రంగయ్య, ఉమా గౌడ్, సూరి, నాగరాజు, బాల చౌడయ్య, చిరంజీవి, హనుమంత్ రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి : టిడిపి

మాట్లాడుతున్న అనిల్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి-గుత్తి

అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాలని గుంతకల్లు తెలుగు యువత నాయకులు ఆర్.అనిల్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మాపురం, ఎంగన్నపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత నాయకుడు ఆర్.అనిల్ కుమార్ గౌడ్, టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తోన్న అక్రమాలు, దౌర్జన్యాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో దుర్మార్గ పాలన కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. సామాన్యులు బతికేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని జగన్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదన్నారు. ఏపీ రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సైకిలు గుర్తుకు ఓటు వేస్తే టిడిపి అధికారంలోకి వస్తుందని చంద్రబాబు నాయుడు సీఎం అయి ప్రజల కష్టాలు తీరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి శ్రీకాంత్ చౌదరి, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్ గౌడ్, మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎం.శ్రీనివాస యాదవ్, సర్పంచి భరత్ కుమార్, ఎంపీటీసీలు నారాయణస్వామి, ధనుంజయ, మాజీ సర్పంచులు శ్రీనివాస్ చౌదరి, వెంకటరాముడు, కె.నాగేంద్ర, సుబ్బారెడ్డి, నాయకులు గోవిందు, కృష్ణారావు, మహమ్మద్ అలీ, గోవర్ధన్ గౌడ్, జి.సుంకన్న, సాంబశివయ్య యాదవ్, సుధాకర్ యాదవ్, లక్ష్మణరావు, రమేష్, కొత్తపేట సూరి, అగ్గిరాముడు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాయదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్‌ను సస్పెండ్ చేయాలని సిఐటియు, మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఏజి.రాజమోహన్, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజులు వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం మున్సిపాల్టీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగుతున్న రవీంద్ర యాదవ్ రాయదుర్గం పట్టణంలో పది సంవత్సరాలుగా విధులు అక్కడే కొనసాగిస్తూ అవినీతికి పాల్పడుతూ, కార్మికుల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటూన్నాడని తెలిపారు. ఆ అధికారి విధుల్లో లేకుండా చెరకు రసం వ్యాపారంలో రాయదుర్గం పట్టణంలో 6 షాపులు, కళ్యాణదుర్గంలో 2 షాపులు లీజుకు తీసుకొని వ్యాపారంలో మునిగి తేలుతున్నాడని తెలిపారు. అధికారి వ్యాపారానికి కర్ణాటక హెూస్పేట్ చాలా సుదూర ప్రాంతం నుంచి చెరకు గడలు తెచ్చేందుకు మున్సిపల్ కార్మికులను పంపించి రాయదుర్గం పట్టణానికి తెప్పిస్తాడన్నారు. మున్సిపల్ కార్మికుల చేత వాటిని అన్‌లోడింగ్ చేయించడం, క్లీనింగ్, కట్టింగ్ చేయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని తెలిపారు. కొడవలితో కటింగ్ చేస్తుండగా హెచ్.తిప్పేస్వామి అనే కార్మికుడి చేతికి బలమైన గాయమైందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్ హిందూపురం పట్టణంలో తన 6 సెంట్ల స్థలంలో రెండంతస్తుల భవనం నిర్మించాడన్నారు. ఆ సమయంలో మున్సిపల్ కార్మికుల చేత ఇంటి పనులు, భవన నిర్మాణ పనులు చేయించుకున్నాడని తెలిపారు. కార్మికులకు ఇవ్వాల్సిన యూనిఫామ్, కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వకుండా నాలుగేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు